


జాబ్‌మేళాలో 42 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక బిసి కాలనీ ప్రభుత్వ ఐటిఐలో జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. 83 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఈ మేళాకు హాజరయ్యారు. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్-6, ఫైనాన్షియల్ కన్సల్టెంట్-50, ఇంటెల్ సర్వ్‌లో ఫీల్డ్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్, ఆఫీసు వర్క్- 25 ఉద్యోగాల భర్తీ కోసం ఈ జాబ్‌మేళాను నిర్వహించారు. ప్రాథమిక పరీక్షల అనంతరం వీటిలో 42 మందిని తదుపరి పరీక్షలకు ఎంపిక చేశారు. ఈ మేళాను జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి, ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు సాగర్, రామ్‌కుమార్, ఎం.యశ్వంత్ బాబు, జిల్లా ఉపాధి కార్యాలయ సిబ్బంది పర్యవేక్షించారు.



అవినీతికి తావులేకుండా పరిపాలన అందిస్తున్నామని చెబుతున్న వైసిపి ప్రభుత్వ హయాంలో అవినీతి మాత్రం చాపకింద నీరులా సాగిపోతోంది. కొంత మంది అధికారులు నిబంధనలను పక్కనపెట్టి దండిగా లంచాలు తీసుకుంటున్నారు. లంచం ఇవ్వకపోతే కనీసం ఫైలు కూడా కదపని పరిస్థితి. ఇదేంటని ప్రశ్నిస్తే బిల్లులు ఆపేస్తామని, దిక్కున్న చోట చెప్పుకోమని తిరిగి బెదిరించడం కొసమెరుపు.

కమీషన్ ఇస్తేనే బిల్లులు

• కాంట్రాక్టర్ల గగ్గోలు • ఎంపిపి వద్ద పంచాయితీ • పంచాయతీ రాజ్ జెఇపై అవినీతి ఆరోపణలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలానికి ఆరు నెలల క్రితం పంచాయతీరాజ్ జెఇగా విశాఖ జిల్లా పద్మనాభ మండలం నుండి ఎం. సుధాకర్ బదిలీపై వచ్చారు. ఆయన వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.4కోట్ల వరకూ వివిధ రకాల అభివృద్ధి పనులు జరిగాయి. వీటి బిల్లులు కోసం కాంట్రాక్టర్లు నానా ఇబ్బందులు పడుతున్నారు. లంచం ఇస్తే తప్ప జెఇ బిల్లులు చెల్లించడం లేదని, బిల్లుల అవ్వక తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.1.20 కోట్లు, ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.1.08 కోట్లు, 13, 14,15వ ఫైనాన్స్ నుంచి కోటిన్నర రూపాయలతో గ్రామాల్లో సిసి రోడ్లు, కాలువలు పలు అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు చేశారు. ఇందులో మూడు కోట్ల రూపాయల వరకు బిల్లులు అయిపోయాయి. ఇంకా కోటి రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి సంబంధించిన బిల్లులు చేయమంటే జెఇ లంచం అడుగుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

కింది స్థాయి ఉద్యోగులకు మరో పర్సంటేజీ

బిల్లులు కోసం జెఇ తీసుకుంటున్న 7 శాతం కమీషన్ డబ్బును కింది స్థాయి ఉద్యోగులకు ఇవ్వకపోవడంతో వారికి వేరేగా మళ్లీ డబ్బులు ఇచ్చుకోవాల్సి వస్తుందని, ఇవ్వకపోతే వారు కూడా పని చేయడం లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కమీషన్ ఎక్కువ మొత్తంలో ఇస్తే రోడ్డు పనుల్లో నాణ్యత చూడటం లేదని, తక్కువ ఇస్తే రోడ్డు నిర్మాణం [illegible] దాటాలన్న నిబంధనలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు.

అక్కడ సరిగా పనిచేయకే ఇక్కడికి

జెఇ గతంలో పనిచేసిన మండలంలో సరిగా పనిచేయ లేదని భావించిన నాయకులు అతన్ని అక్కడి నుంచి ఈ మండలానికి బదిలీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు వద్ద చాలాసార్లు పంచాయితీ కూడా జరిగిందని, ఎన్నిసార్లు చెప్పినా ఆయన వినడం లేదని కాంట్రాక్టర్లు అంటున్నారు. ఆయనకు కమీషన్లు ఇచ్చుకోలేక చాలా మంది కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిసింది.

అతన్ని బదిలీ చేసి వేరే జెఇను తీసుకువచ్చి బిల్లులు త్వరగా అయ్యేటట్టు చూడాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

నూటికి ఏడు శాతం లంచం

మండలంలో ఏ పని చేసినా నూటికి ఏడు శాతం డబ్బులు ఇస్తే గాని బిల్లులు చేయడం లేదని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. బిల్లులు అయ్యేని వాటికి కూడా ముందుగుండానే పర్సంటేజీ వసూలు చేస్తున్నారని ఇవ్వకపోతే ఎం.బుక్ చేయడం లేదని చెబుతున్నారు. ఎవరు ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లిస్తే వారికే ముందుగా బిల్ చేస్తున్నారని, తక్కువ ఇచ్చిన వారికి, అసలు డబ్బులివ్వని వారికి బిల్లులు చేయడం లేదని వాపోతున్నారు.

బిల్లులు రాకున్నా తప్పని పర్సంటేజీలు

చాలా మంది కాంట్రాక్టర్లు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోయినా అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశారు. పని పూర్తి చేసిన చోట కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో అప్పులు పాలవుతున్నారు. మరో పక్క బిల్లులు పెట్టడానికి జెఇకి పెద్ద మొత్తంలో పర్సంటేజీలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని చెబుతున్నారు. గడపగడపకు చేసిన పనులకు లక్షకు రూ.18 వేలు జిఎస్‌టి రూపంలో పోతుందని, మరో 7 వేల రూపాయలు జెఇకి కమీషన్ రూపంలో పోతుందని, తమకేమీ మిగలడం లేదని ఆరోపిస్తున్నారు.


నాణ్యత గురించి అడిగితే ఆరోపిస్తున్నారు

బిల్లుల గురించి ఎంపిపి వద్ద పంచాయతీ అవ్వడం వాస్తవమే. బిల్లులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్లు అడిగారు. నాణ్యత గురించి అడిగితే పర్సంటేజీ అడుగుతున్నామని అంటున్నారు. నేను ఎవరి వద్ద కూడా లంచం తీసుకోవడం లేదు.

- ఎం.సుధాకర్, పంచాయతీరాజ్ జెఇ

'రియల్' కారణాలేనా..?

తహశీల్దార్ హత్యతో ఉలిక్కిపడ్డ విశాఖ, విజయనగరం



బొండపల్లి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రమణయ్య (ఫైల్)

ప్రజాశక్తి - మధురవాడ

విశాఖలోని చినగదిలి మండల తహశీల్దారుగా పనిచేసి ఇటీవలే విజయనగరం జిల్లా బొండపల్లి మండలానికి బదిలీ అయిన సనపల రమణయ్య దారుణ హత్యకు గురవడంతో విశాఖ, విజయనగరం జిల్లాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. తమ భద్రతపై రెవెన్యూ ఉద్యోగులు కలవరపాటుకు గురయ్యారు. రియల్ ఎస్టేట్, భూవివాద అంశాలే రమణయ్య హత్యకు కారణాలుగా తెలుస్తోంది. ఇదే విషయాన్ని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మీడియా సమావేశంలో శనివారం మధ్యాహ్నం ప్రస్తావించారు.

రమణయ్య సొంతూరు.. శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం దిమ్మిలాడ. ఆయనకు భార్య, పాప, బాబు ఉన్నారు. వచ్చే క్రితం విధుల్లో చేరిన ఆయన ఉత్తరాంధ్రలోని వజ్రపుకొత్తూరు, పద్మనాభం, విశాఖ రూరల్ (చినగదిలి) మండలాల్లో తహశీల్దార్‌గా పనిచేశారు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. తొలిరోజు శుక్రవారం విధులకు హాజరై రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి చేరుకున్న ఆయనపై 10 గంటల సమయంలో దాడి జరిగింది. ఇనుపరాడ్డుతో గుర్తు తెలియని వ్యక్తి తలపై కొట్టడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. అనంతరం ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతిచెందారు.

ముక్కుసూటి మనిషిగా రమణయ్యకు పేరు

ముక్కు సూటి మనిషిగా, అవినీతికి దూరంగా ఉండే వ్యక్తిగా రమణయ్యకు పేరు. భూదందాలకు పెట్టిందే పేరుగా ఉన్న చినగదిలి మండలంలో పాటు ఆయన పలుచోట్ల రెవెన్యూ విభాగంలో పనిచేశారు. ఈ క్రమంలో భూ ఆక్రమణలకు సహకరి [illegible] కారణ మేమోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

విజయనగరం : బొండపల్లి తహశీల్దార్ సనపల రమణయ్య హత్యను రెవెన్యూ ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. ఈ హత్యకు వ్యతిరేకంగా కలెక్టరేట్ పోర్టికో వద్ద శనివారం రెవెన్యూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులపై దాడులను అరికట్టాలని, ఈ హత్యకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సూర్య, కలెక్టరేట్ యూనిట్ నాయకులు, సర్వేశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

రామభద్రపురం : తహశీల్దార్ రమణయ్య హత్యకు వ్యతిరేకంగా స్థానిక రెవెన్యూ ఉద్యోగులు నిరసన తెలిపారు. తహశీల్దార్ సులోచనారాణి మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపతహశీల్దార్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

ఐక్య పోరాటంతో సమస్యల పరిష్కారం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని ● మిమ్స్ ఉద్యోగులకు మద్దతు



నిరసన శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు ఐక్య పోరాటంతో సమస్యలు పరిష్కరించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన శిబిరం మూడో రోజు కొనసాగింది. ఈ శిబిరాన్ని తమ్మినేని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం మొండివైఖరి వీడి, ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 2020 అక్టోబర్ నుంచి బకాయి ఉన్న 7 డిఎలను వెంటనే చెల్లించాలని, సస్పెండ్ చేసిన ఉద్యోగులు ఇద్దరినీ బేషరతుగా వీధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా బదిలీ చేసిన ఉద్యోగులకు మిమ్స్‌లోనే డ్యూటీలు ఇవ్వాలని, రెండేళ్లు సర్వీసు దాటిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులపై కక్ష సాధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

మిమ్స్ యాజమాన్యం పంతాలకు పోకుండా వెంటనే కమిటీతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, మిమ్స్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, మిరప నారాయణరావు, వి.ఆదినారాయణ, రామకృష్ణ, కామునాయుడు, నర్సింగరావు, రమణ, వరలక్ష్మి, గౌరి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన

ఆసరా సంబరాల్లో మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-గరివిడి

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా గత నాలుగున్నరేళ్లుగా కార్యక్రమాలు అమలు చేశామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. తమ పనితనం బాగుందని, ప్రభుత్వం మేలు చేసిందని భావిస్తేనే మరోసారి ఆదరించాలని కోరారు. గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వ పాలనకు తేడాను గుర్తించాలన్నారు. గరివిడిలో శనివారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా సంబరాలు నాలుగో విడత కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరివిడి మండలంలో ప్రతి గ్రామానికీ రోడ్డు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాలకు రోడ్లు వేశామని, మిగిలిన గ్రామాలకు కూడా రోడ్లు వేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులు కూడా గ్లోబల్ సిటిజన్లుగా రూపొందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వారికి ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అనంతరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని మహిళా స్వయంశక్తి సంఘాల్లోని 13,086 మహిళలకు నాలుగో విడత ఆసరా మొత్తానికి సంబంధించిన రూ.7.92 కోట్ల చెక్కును మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని మహిళా సంఘాలు తయారు చేస్తున్న వస్తువుల ప్రదర్శనను మంత్రి బొత్స పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఎంపిపి మీసాల విజయలక్ష్మి, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణచక్రవర్తి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

రోడ్డు, వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

గరివిడి నుంచి గెడ్డపువలస మీదుగా దేవుని కనపాక వరకు రూ.3.60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 5.70 కిలోమీటర్ల రోడ్డుకు, పెద్దగెడ్డపై రూ.5.20 కోట్లతో నిర్మించనున్న వంతెనకు గెడ్డపువలసలో మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. పిఎంజిఎస్‌వై-3 కింద రోడ్డు, వంతెనలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్‌ఇ బిఎస్ఆర్ గుప్తా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

వనితే.. ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి- విజయనగరంకోట

ప్రతి కుటుంబంలో వనితే మొదటి ఫ్యామిలీ డాక్టర్ అని అక్షర ఫౌండేషన్ అధినేత ఇందుమతి ఉద్దరాజు అన్నారు. నగరంలో ఎంఆర్ లేడీస్ రీ క్రియేషన్స్, వెల్ఫేర్ క్లబ్‌లో ఆరోగ్యంగా ఎలా ఉండవచ్చు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుమతి మాట్లాడుతూ ప్రజల జీవనశైలిలో ఆహార అలవాట్లు ఎలా ఉండాలో వివరించారు. ఆహార అలవాట్లపై స్కూల్లో విద్యార్థి దశ నుంచే నేర్పిస్తే కుటుంబాలను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపతి, కార్యదర్శి పి.రమణమ్మ, జాయింట్ సెక్రటరీ సూర్యకుమారి, విజయలక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

నేడు ఎపిటిఎఫ్ జిల్లా సమావేశం

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

స్థానిక జెడ్‌పి మినిస్టీయల్ భవనంలో ఆదివారం ఎపిటిఎఫ్ జిల్లా జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బుకారి బాబు, పి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ పి.రఘువర్మ, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చాంద్ బాషా హాజరవుతున్నారని తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఉద్ఘాటించారు. శనివారం స్థానిక తోటపాలెం, బాలాజీనగర్‌లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టణ ప్రగతి కేంద్రాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు వివిధ రకాల ఉత్పత్తులను ఏర్పాటు చేశారు. పేపర్ ప్లేట్లు తయారీ, ఆర్టిఫిషియల్ జువెలరీ, కంప్యూటరైజెడ్ ఎంబ్రాయిడరీ, క్లాత్ బ్యాగ్స్ తయారీ, స్క్రీన్ ప్రింటింగ్ కేంద్రాలను లాంచనంగా ప్రారంభించి, సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించే విధంగా సబ్సిడీ రూపంలో రుణాలు మంజూరు చేస్తూ మహిళల్లో చైతన్యాన్ని తీసుకొస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తే ఆ కుటుంబానికి అండగా నిలవగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలను కూడా మహిళల పేరిటే రిజిస్ట్రేషన్ చేయించే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయ యాదవ్, కమిషనర్ ఎం.ఎం.నాయుడు, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, మెప్మా పీడీ సుధాకరరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు జివి రంగారావు, రేగాన రూపాదేవి, గాదం మురళి, జోనల్ ఇన్‌ఛార్జులు మారం బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్లు పంపిణీ

జీవన విధానానికి అంగవైకల్యం అడ్డుకారాదని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ముగ్గురు వికలాంగులకు ట్రై సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. కార్పొరేటర్లు బండారు ఆనందరావు, మీసాల రమాదేవి, నాయకులు లంక వరలక్ష్మి, దేశెట్టి మోహనరావు, పిల్లా రామకృష్ణ, వి.శివప్రసాద్, మెండా రమణ పాల్గొన్నారు.

కల్మషం లేని మనుషులు గిరిజనులు

ప్రజాశక్తి-విజయనగరంకోట



మాట్లాడుతున్న దూసి రామకృష్ణ

కల్మషం లేని మనుషులు గిరిజనులని, దేశాన్ని రక్షించడంలో ముందు వరుసలో నిలబడిన యోధులని విద్యాభారతి జాతీయ అధ్యక్షులు దూసి రామకృష్ణ కితాబిచ్చారు. తూర్పు కనుమలలో గిరిజన సాంస్కృతిక యాత్ర శనివారం విజయనగరం చేరింది. ఈ సందర్భంగా గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద గిరిజన యూనివర్సిటీ, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో 'గిరిజన సంస్కృతిని రక్షిద్దాం - గిరిజన హక్కులను కాపాడదాం' అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు తమ సంస్కృతిని పరిరక్షిస్తూ మొదటి వరుసలో నిలబడిన యోధులన్నారు. దేశానికి కొండలు పెట్టని కోటలా ఉంటూ రక్షిస్తున్నాయని చెప్పారు. అనంతరం వస్త్ర వ్యాపారి నరసింహారావు, చిన్నపిల్లల వైద్యనిపుణులు శేషగిరిరావు మాట్లాడారు. అనంతరం పలువురు ప్రముఖులను సన్మానించారు. కార్యక్రమంలో వనవాసి కళ్యాణ్ ఆశ్రమ రాష్ట్ర కోఆర్డినేటర్ బి.నాగేశ్వరరావు, ఆలిండియా నాయకులు గిరీష్ కుబేర్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత బొబ్బిలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



విజేత జట్టుతో అధికారులు

ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీల్లో వాలీబాల్ బాలురు విభాగంలో విజేతగా బొబ్బిలి నియోజకవర్గ జట్టు నిలిచింది. ఎస్.కోట, విజయనగరం జట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో చీపురుపల్లి జట్టు విజేతగా, ఎస్.కోట, విజయనగరం జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఖోఖో బాలురు విభాగంలో చీపురుపల్లి విజేతగా, గజపతినగరం, విజయనగరం జట్లు రెండు, మూడు స్థానాలను కైవశం చేసుకున్నాయి. విజేతలకు సెట్విజ్ సిఇఒ రామ్‌గోపాల్, డిఎస్‌డిఒ ఎం.అచ్యుతరావు బహుమతులు ప్రదానం చేశారు.



కళాశాల గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన


ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టేందుకు అనువైన కౌంటింగ్ కేంద్రాలు, ఇవిఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ నాగలక్ష్మి, ఇతర అధికారులు శనివారం పలు ప్రభుత్వ, ప్రయివేటు భవనాలను పరిశీలించారు. దీనిలో భాగంగా స్థానిక పోలీసు శిక్షణ కళాశాల, డెంకాడ మండలంలోని లెండి కళాశాల, నెల్లిమర్ల మండలంలోని సెంచూరియన్ యూనివర్సిటీలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని భవనాలు, వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను పరిశీలించడంతోపాటు రహదారి, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. స్ట్రాంగురూములు, వాటికి సమీపంలోనే లెక్కింపు చేపట్టేందుకు అనువుగా ఉన్న భవనాలను గుర్తించాలని ఆదేశించారు. ఎన్నికల పరిశీలకులు, ఇతర అధికారులు వేచి ఉండేందుకు తగిన గదులను కూడా ముందే గుర్తించాలని సూచించారు. ఆయా సంస్థల ఉన్నతాధికారులు, యాజమాన్య ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు స్వాగతం పలికి, తమ సంస్థల్లోని సదుపాయాలను వివరించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్.డి.అనిత, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ పాల్గొన్నారు.

ఉన్నవాటికే టికానా లేదు.. కొత్తగానా..?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఇప్పటికే ఉన్న పారిశ్రామిక వాడలు వెలవెలబోతుంటే... మరోవైపు పరిశ్రమల ఏర్పాటుకు కొత్తగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తారట. పారిశ్రామికాభివృద్ధి పేరిట సాగుతున్న ఈ భూబాగోతం ఎవరి కోసమో? అంటూ జనం చర్చించుకుంటున్నారు. జిల్లాలోని నాలుగు పారిశ్రామిక వాడల్లో కావాల్సినంత స్థలాలు ఉన్నాయి. వాటిలో ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. చాలా కాలం క్రితం ఏర్పాటు చేసిన కొన్ని పరిశ్రమలు మూతపడ్డాయి. ఇవి కాకుండా జిల్లాలో జూట్, ఫెర్రో ఎల్లాయీస్, చెరకు ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. మూతపడినవి తెరిపించాలన్న చిత్తశుద్ధి ఎలాగూ లేదు. కనీసం ఖాళీగా ఉన్న పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొంతలో కొంతైనా ఉండేవి. ఈ పారిశ్రామికవాడలను వినియోగించుకోవాలన్న ధ్యాస అటు పాలకులకు గానీ, ఇటు అధికారులకు గానీ లేకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వివిధ పారిశ్రామిక యూనిట్ల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటూ నిన్నగాక మొన్న జరిగిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశంలో అధికారులు చర్చించిన సంగతి తెలిసిందే. జిల్లాలో కొత్త పరిశ్రమలు, పారిశ్రామిక వాడల స్థాపన, విస్తరణకు ఉన్న అవకాశాలను, భూముల కేటాయింపు, రాయితీల విడుదల తదితర



అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో రెండు ఇండస్ట్రియల్ క్లస్టర్ల ఏర్పాటుకు పనులు వేగవంతం చేయాలన్నారు. మెరకముడిదాం మండలం గర్భాం వద్ద సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ ప్లాంట్స్, భీమాలి వద్ద మామిడి తాండ్ర తయారీ క్లస్టర్లను ఏర్పాటు చేయడానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో పాత పారిశ్రామికవాడల్లో ఖాళీగా ఉన్న స్థలాల సంగతేమిటి? అంటూ జనం చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా 1981లో బొబ్బిలిలో ఏర్పాటుచేసిన గ్రోత్ సెంటర్ వెలవెలబోతోంది. ఇందులో ప్రస్తుతం సుమారు 12 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల 137 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన ప్లాట్లలో ఏర్పాటు చేసిన కంపెనీల్లో చాలా వరకు మూతపడ్డాయి. ఇటు విజయనగరంలో విటి అగ్రహారంలో రూ.కోట్ల విలువ చేసే ప్లాట్లు సుమారు 30 వరకూ ఖాళీగానే ఉన్నాయి. సారిపల్లి, కొత్తవలస మండలం కంటకాపల్లి పారిశ్రామికవాడల్లోనూ ఎకరాల తరబడి స్థలాలు ఉన్నాయి. వీటిలో పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా కొత్తగా భూములు సేకరించి, వాటికి పారిశ్రామిక క్లస్టర్లు అనే పేరు పెట్టడం వెనుక ఏదో అవినీతి, అక్రమాల బాగోతాలు ఉండే ఉంటాయంటూ జనం నుంచి అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికే ఖాళీ ప్లాట్లలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేవారని అంటున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్టుగా ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అధికారంలో ఉండగానే భూములు దోచుకోవాలన్న తలంపుతో కొత్తగా పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు అంశాన్ని తెరపైకి తెచ్చారని జనం విమర్శిస్తున్నారు.

హెల్మెట్‌తోనే వాహనదారులకు భద్రత

ప్రజాశక్తి-విజయనగరంకోట



ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సిఐ రంగనాథ్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జిఆర్ రవీంద్రనాథ్ కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలో ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు సంభవిస్తే హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రోడ్డుపై వాహనాలు నడిపేవారే కాకుండా, పాదచారులు సైతం రహదారి భద్రతా నియమాలను తెలుసుకోవాలని సూచించారు. వీటిపై అందరికీ సంపూర్ణ అవగాహన ఉంటే, చాలావరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ద్విచక్ర వాహన ర్యాలీని స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిఐ రంగనాథ్ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆర్‌టిసి కాంప్లెక్స్, మయూరి జంక్షన్, సంతకాల వంతెన, కలెక్టరేట్ మీదుగా ఆర్‌టిఒ కార్యాలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ రమేష్, ఎంవిఐలు ఎవి రమణ, యు.దుర్గాప్రసాద్, కెఆర్ఎస్‌పి ప్రసాద్, ఎఎంవిఐలు వి.శ్రావ్య, వి.ఐశ్వర్యలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రంలో డ్రగ్స్ పాలన : టిడిపి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో ప్రస్తుతం డ్రగ్స్ పాలన సాగుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు అన్నారు. శనివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని, ఫలితంగా నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యాసంస్థల్లోనూ గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందన్నారు. పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారని చెప్పారు. అనంతరం టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ మొన్న ప్రకటించింది ఎన్నికల డిఎస్‌సి అని ఆక్షేపించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బి.నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, కనకాల మురళీమోహన్, కంది మురళినాయుడు పాల్గొన్నారు.

పథకం అందిన ప్రతిఒక్కరూ అండగా నిలవాలి

ప్రజాశక్తి- రేగిడి

సంక్షేమ పథకాలు అందిన ప్రతి కుటుంబం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని విజయనగరం జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శనివారం రేగిడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆసరా పథకంలో భాగంగా రూ.10.54 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాజాం నియోజకవర్గం మద్దువలస, తోటపల్లి జలాశయాల నుండి సాగునీరు అందించి, రైతు సంక్షేమాన్ని అందించినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించే ఘనత ముఖ్యమంత్రి దేనని అన్నారు. సంక్షేమ పథకాలు అందిన ప్రతి ఒక్కరూ ఆలోచించి రానున్న 2024 ఎన్నికల్లో రాజాం నియోజకవర్గం నుండి అత్యధిక ఓట్ల మెజార్టీతో తలే రాజేష్‌ను గెలిపించాలని కోరారు. రాజాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలే రాజేష్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే రుణపడి సేవ చేసుకుంటానని అన్నారు.

చైర్మన్ ప్రసంగానికి ముందే వెనుదిరిగిన మహిళలు

గ్రామస్థాయిలో మహిళా సంఘ సభ్యులను ద్వితీయ శ్రేణి నాయకులు ఆటోలతో 12 గంటలకు మండల కేంద్రానికి తరలించారు. అయితే జిల్లా పరిషత్ ఛైర్మన్ 3.45 గంటలకు సభా స్థలి వద్దకు రావడంతో మహిళలు సహనం కోల్పోయారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతుండగానే చాలా మంది మహిళలు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడే సమయానికి ఖాళీ కుర్చీలే కనిపించాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా ఛైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, మండల ప్రత్యేకాధికారి కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎసి చిరంజీవి, ఎపిఎం గోవిందరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.




గౌరీశ్వరిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

బాడంగి: డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి, మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగో విడత ఆసరా పథకం కింద మండలంలో 949 స్వయం సహాయక సంఘాలు, 10,269 మంది మహిళలకు రూ.4.68 కోట్లు చెక్కును అందించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళల రుణాలు రద్దు చేస్తానని మాట తప్పి చివరకు ఎన్నికల సమయంలో పసుపు కుంకుమ పథకం కింద ఒక్కొక్కరికి కేవలం రూ.10 వేలు అందించి చేతులు దులుపేసుకున్నారని విమర్శించారు.

ఇటీవల ఢిల్లీలో రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొన్న ముగడ గ్రామానికి చెందిన సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ తెంటు గౌరీశ్వరిని ఎమ్మెల్యే సన్మానించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతి భద్రతా బలగాల్లో విధులు నిర్వర్తిస్తూ, రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ శంబంగి శ్రీకాంత్, ఎంపిడిఒ ఆంజినేయులు, ఎపిఎం భాగ్యలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి రామారావు, వైసిపి నాయకులు తెంటు మధు, మరిపి శంకర్, బి రమేష్, శివప్రసాద్, చిన్నపుడూర్ పాల్గొన్నారు.



రేగిడి: మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న జెడ్‌పి ఛైర్మన్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

తెర్లాం : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ బి. మధుసూదనరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులంతా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. సర్వేలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోటరీ బస్‌షెల్టర్ ప్రారంభం

బొబ్బిలి: ప్రయాణికులు కోసం రోటరీ క్లబ్ నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. శ్రీకాకూరాలి జంక్షన్‌లో బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన రోటరీ క్లబ్ బస్సు షెల్టర్ నిర్మించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ప్రయాణికులు కోసం బస్సు షెల్టర్ నిర్మించడం అభినందనీయం అన్నారు. రోటరీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు జేసీ రాజు, వి.శ్రీహరి, కోశాధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యాకులమాత జాతర

కొత్తవలస: మండలంలోని కొండదాబాలలో ఆదివారం వ్యాకుల మాత జాతర ప్రారంభం కానుందని వ్యాకుల మాత జాతర సమన్వయకర్త ఫాదర్ గొంగాడ రాజు తెలిపారు. శనివారం ఉదయం నుంచి విశాఖపట్నం నుంచి వేలాది మంది యాత్రికులు కాళ్ల నడకతో వ్యాకుల మాత కొండకు చేరుకుంటారని తెలిపారు. జాతరకు విచ్చేస్తున్న యాత్రికులు దారి పొడవునా మంచినీరు, మజ్జిగ, ఇతర పానీయాలు యాత్రికులు అందిస్తున్నారని తెలిపారు. శనివారం రాత్రికి కొండదాబా దిగువ బస చేస్తారని ఆదివారం యథాతిథిగా కొండదాబా జాతర ప్రారంభం కానుందని తెలిపారు.

విభజన హామీలను అమలు చేయాలి

బొబ్బిలి: విభజన హామీలను అమలు చేయాలని పిసిసి సభ్యులు ముద్దువ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బిజెపిని గెలిపిస్తే విభజన హామీలను అమలు చేస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విభజన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన బిజెపికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే విభజన హామీలను అమలు చేస్తామని చెప్పారు.

సీతారామునిపేట మాజీ ఎంపిటిసి మృతి

నెల్లిమర్ల: సీతారామునిపేట మాజీ ఎంపిటిసి, రిటైర్డ్ టీచర్ కళ్యాణం లక్ష్మునాయుడు శనివారం ఎనభై (80) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. సీతారామునిపేట పంచాయతీ పరిధి జగ్గరాజుపేట గ్రామానికి చెందిన కళ్యాణ లక్ష్మునాయుడు ఉపాధ్యాయునిగా పనిచేసి రిటైర్డ్ అనంతరం ప్రజా సేవలో దిగి 2006 నుండి 2010 వరకు సీతారామునిపేట ఎంపిటిసిగా సేవలందించారు. లక్ష్మునాయుడుకు భార్య, పిల్లలు ఉన్నారు. ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు, తదితరులు పరామర్శించి సానుభూతి తెలిపారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

వేపాడ: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేటాయించిన పాఠశాలలను జిల్లా డిప్యూటీ డిఇఒ కంది వాసుదేవరావు శనివారం పరిశీలించారు. వేపాడ, ఎస్‌కెఆర్‌పురం వల్లంపూడి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, విద్యాభారతి పాఠశాలలను ఆయన పరిశీలించి పరీక్షలకు ఏ విధమైన అసౌకర్యమూ కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచాలని ఎంఇఒ పి. బాల భాస్కరరావుకు సూచించారు. ఈ పరిశీలనలో వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ శ్రీవల్లి, విద్యాభారతి కరస్పాండెంట్, సోంపురం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో గౌరిబాబుకు రజతం

నెల్లిమర్ల: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడకు చెందిన గౌరిబాబు ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించాడు. శనివారం మహారాష్ట్ర లో జరిగిన 37వ అఖిల భారత పోస్టల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండపల్లి గౌరిబాబు 61కేల విభాగంలో పాల్గొని ద్వితీయ స్థానంలో రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా గౌరిబాబును జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బెల్లాన లక్ష్మి నగేంద్ర, సెక్రటరీ, కోచ్ చల్లా రాము, స్టేట్ ప్రెసిడెంట్ లక్ష్మి, సెక్రటరీ దినేష్‌బాబు, బి.వెంకట రామయ్య అభినందించారు.

పనుల గుర్తింపునకు సమావేశాలు

వేపాడ: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను గుర్తించేందుకు సమావేశాలు ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ స్టేట్ ఆడిట్ అధికారి ఎస్‌ఆర్‌పి అచ్యుతరావు అన్నారు. స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథకం సమావేశ మందిరంలో ఆయన శనివారం క్షేత్రసహాయకులు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనులు గుర్తింపుకు సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వారి ఆమోదం పొందాలన్నారు. పీఆర్‌జీఇఎ ఆలీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని, తెలియని విషయాలు ఏమైనా ఉంటే తెలుసుకొని వారికి తానెప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. సమావేశంలో డిఆర్‌పిలు, క్షేత్ర సహాయకులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొండవెలగాడలో అభివృద్ధి పనులు ప్రారంభం

నెల్లిమర్ల: మండలంలోని కొండవెలగాడ రెడ్డిక వీధిలో సిసి రోడ్డు, సిసి కాలువల పనులను జడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు శనివారం ప్రారంభించారు. సుమారు రూ.3.50లక్షల వ్యయంతో సిసి రోడ్డు, సిసి కాలువల పనులను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఎన్ని నిధులైనా మంజూరు చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ పనులకు నిధులు అందుబాటులో లేకపోయినా తన సొంత నిధులతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డిక వీధి ప్రజలు హర్షం వ్యక్తం చేసి జడ్‌పిటిసికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్‌కు ఎంపిక

తెర్లాం: జిల్లాస్థాయి వాలీబాల్ ఫైనల్ పోటీలకు బూరిపేట సచివాలయం జట్టు ఎంపికైంది. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామ, మండల, నియోజకవర్గస్థాయిలో విజయం సాధించిన ఈ జట్టు జిల్లాస్థాయిలో ఫైనల్‌కు చేరడం చాలా ఆనందంగా ఉందని గ్రామ సర్పంచ్ బూరి మధుసూదన్ రావు అన్నారు. జిల్లా స్థాయి విజేతగా నిలిచి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఈ సందర్భంగా తెలియజేశారు.

ప్రభుత్వ వైద్య కళాశాలతో ఎంఒయు

నెల్లిమర్ల: ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధాన అధ్యాపకులు కె. పద్మలీలతో సెంచూరియన్ విశ్వవిద్యాలయం శనివారం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. సెంచూరియన్ తరఫున వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి మాట్లాడుతూ ఈ ఒప్పందం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బిఎస్‌సి నర్సింగ్, అనస్థీసియా, రేడియాలజీ చదువుతున్న విద్యార్థులకు క్లినికల్ ప్రాక్టీస్, ఇంటర్న్ షిప్, ప్రాజెక్టులు, పరిశోధన తదితర వాటికి ఈ ఒప్పందం దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఫార్ మెడికల్ డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, డాక్టర్ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

దగా డిఎస్‌సి వద్దు: గురాన

విజయనగరం టౌన్: డిఎస్‌సి పేరుతో ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తోందని జనసేన నేత గురాన అయ్యలు విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'అదిగో మెగా డిఎస్‌సి.. ఇదిగో మెగా డిఎస్‌సి..' అంటూ ఊరించి, నాలుగున్నర ఏళ్ల తర్వాత నిరుద్యోగుల చెవిలో పువ్వులు పెట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎన్నికల ముందు మెగా డిఎస్‌సి అంటూ చెప్పిన ప్రభుత్వం ఇన్నాళ్లు కాలయాపన చేసి, తీరా ఎన్నికల సమయం వచ్చేసరికి సిఎం జగన్‌కు నిరుద్యోగులు గుర్తొచ్చారా ఎద్దేవా చేశారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో మరోసారి మోసం చేయాలని మెగా డిఎస్‌సి పేరుతో మెగా దగా చేయడానికి సిద్ధమయ్యారని, దీన్ని నిరుద్యోగులు గమనించాలని కోరారు. 21 వేల టీచర్ పోస్టులు ఖాళీలుంటే కేవలం 6,100తో మమా అనిపిస్తున్నారని, ఇది నిరుద్యోగులను, ప్రజలను మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెరుగైన పౌర సేవలను అందించి సచివాలయాల ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయాలని సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు కార్యదర్శులకు సూచించారు. శనివారం నగరంలోని 40వ నంబర్ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలను ఏ విధంగా అమలు చేస్తున్నారన్న విషయమై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిపిఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

నెమలాంలో జయహో బిసి గర్జన

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని నెమలాం గ్రామంలో శుక్రవారం రాత్రి జయహో బీసీ గర్జన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందు టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు గ్రామంలో పర్యటించి చంద్రబాబు మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బేబినాయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందన్నారు. బీసీల అభివృద్ధి చెందాలంటే అది ఒక టిడిపితోనే సాధ్యమన్నారు. బీసీలను అన్ని రకాలుగా ఆదుకుంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఆ గ్రామానికి చెందిన నేతల రాము ఇటీవల కూలీ పనులు కోసం చెన్నై వలస వెళ్లి మృతి చెందడంతో ఆయన కుటుంబానికి 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. మరి కొంతమంది అనారోగ్యంతో ఉన్నవారిని పరామర్శించి ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, వెంకటేశ్వరరావు, ఎ. సురేష్, జి. వెంకట్ నాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



అనారోగ్యంతో ఉన్న కార్యకర్తను పరామర్శిస్తున్న బేబినాయన

టిడిపితోనే బిసిలకు న్యాయం

మెంటాడ: టిడిపి హయాంలోనే బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శనివారం మెంటాడలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో బీసీలు అణచివేతకు గురయ్యారని విమర్శించారు. ఆ వర్గాన్ని జగన్ రెడ్డి ఓటు బ్యాంకు గానే చూస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు విధులు లేకుండా ఉత్సవ విగ్రహాల్లా మార్చారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, జి. అన్నవరం, రెడ్డి ఆదినారాయణ, రెడ్డి ఎర్నాయుడు, ఆర్.రవిశంకర్, ఆర్.సత్యనారాయణ, రామ చంద్రుడు, చిన్నం నాయుడు పాల్గొన్నారు



పది, ఇంటర్ విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న నిర్వాహకులు

గురుకులంలో పది పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలపై సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సమన్వయ కర్త టి.పద్మజ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో బాగా చదివి రాయాలన్నారు. ఈ పరీక్షలు మీ భవిష్యత్‌కు బాటలు వేస్తాయని భయపడకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఆయా సబ్జెక్ట్‌లో సందేహాలుంటే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి సలహాలు సూచనలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డివి చంద్రశేఖర్, రిటైర్డ్ డిసిఒ కోటేశ్వర రావు, ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, పూర్వ విద్యార్థులు కనకరాజు, గణేష్, అప్పా టీమ్ అప్పన్న, మోటివేటర్ జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో టిడిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. 225 మోటార్ బైక్‌లపై యువత ర్యాలీగా వావిలిపాడు నుంచి చినగుడిపాల, ఎన్‌కెఆర్‌పురం, కుంపల్లి, కృష్ణరాయుడుపేట బల్లంకి, బాణాది నల్లబెల్లి వరకు సాగింది. బైక్ ర్యాలీకు ముందు వరుసలో గొంప కృష్ణ సైకిల్‌పై ర్యాలీ చేశారు. నల్లబెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేది టిడిపి, జనసేన ప్రభుత్వమేనన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధిని తుంగలో తొక్కేశారన్నారు. అధికార పార్టీ నాయకులు దాచుకోవడం, దోచుకోవడానికి ఈ నాలుగున్నర సంవత్సరాలు సరిపోయిందని ఎవరైనా అడిగితే తప్పుడు కేసులు పెట్టి హింసించడమే తప్ప స్వతంత్రంగా బ్రతికే అవకాశం లేకుండా నిరంకోస పాలన సాగిస్తున్నారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడంతో పాటు చదువుకున్న పిల్లలందరికీ అమ్మబడి మంజూరు చేస్తామన్నారు. భూమున్న ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 20వేలు నగదు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, విశాఖపట్నం సమన్వయకర్త జనపరెడ్డి ఈశ్వరరావు, మండల ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, టిడిపి నాయకులు సిరికి రమణ, గొర్లె నాగరాజు, మంచిన అప్పలసూరి, 29 పంచాయతీలకు చెందిన టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు గొంప కృష్ణ, తదితరులు

6న సర్పంచుల 'చలో అసెంబ్లీ'

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఈ నెల 6న జరగనున్న సర్పంచుల ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి గేదెల రాజారావు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు స్వామినాయుడు పిలుపునిచ్చారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సర్పంచుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6న జరగనున్న ఛలో అసెంబ్లీ జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14,15 ఆర్థిక సంఘం ద్వారా పంపిన రూ.8629కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించి దారి మళ్లించిన నిధులను సర్పంచుల ఖాతాల్లో జమ చెయ్యాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలను, వాలంటీర్లను గ్రామ పంచాయతీల, సర్పంచుల ఆధీనంలోనే పని చేయించాలని, ఉపాధి హామీ నిధులను చట్ట ప్రకారం గ్రామ పంచాయతీలకు ఇచ్చి సర్పంచుల చేత ఖర్చు చేయించాలని, గతంలో మాదిరిగా గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచులకు, ఎంపిటిసిలకు రూ.15 వేలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలకు రూ. 30 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సర్పంచులంతా ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ప్రతిభను వెలికి తీసేందుకే...

ప్రజాశక్తి- శృంగవరపుకోట

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్నేహ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు ఏఎస్ వెంకటరావు తెలిపారు. శనివారం ఎస్‌కోట మండలంలోని 5, వేపాడ మండలంలోని 2 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్షలను ఆయన పరిశీలించి మాట్లాడారు. స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పదో తరగతి విద్యార్థులకు స్నేహ ప్రతిభ పరీక్షను సుమారు 470 మంది విద్యార్థులకు నిర్వహించిందన్నారు. ఈ ప్రతిభ పరీక్షలో ప్రతి పాఠశాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు సంస్థ వార్షికోత్సవం నాడు బహుమతి ప్రధానం చేస్తామని ఆయన తెలిపారు. ఈ పరీక్షలను సంస్థ కార్యదర్శి మంథా సుబ్బారావు, సభ్యులు డాక్టర్ పి. వరలక్ష్మి, రామనారాయణ, పి. శ్రీరాములు, ఎం. శ్రీనివాసరావు, వి. జగన్నాథం, ప్రసాద్, సీతారాం మూర్తి, పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహించారు.

ఎంపిడిఒ, తహశీల్దార్ల బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- తెర్లాం

తెర్లాం ఎంపిడిఒగా మధుసూదన్‌రావు, తహశీల్దార్‌గా దిలీప్ చక్రవర్తి బాధ్యతలు స్వీకరించారు. వీరిని ఆయా శాఖల సిబ్బంది సన్మానించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను ప్రజాశక్తి పలుకరించగా తాము ఉన్నంత కాలం ప్రజా సేవలో ఉంటామన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా నేరుగా తమను సంప్రదించవచ్చునన్నారు. అనంతరం ఎపిఒ సుశీల తన సిబ్బందితో మర్యాదపూర్వకంగా ఎంపిడిఒను కలిశారు. సచివాలయ సెక్రెటరీలు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిపి ఉమాలక్ష్మి అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

తహశీల్ధార్‌గా రామారావు బాధ్యతలు

డెంకాడ: స్థానిక తహశీల్దార్‌గా జె. రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ పి. ఆదిలక్ష్మి శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

మండలానికి కొత్త ఎంపిడిఒ, తహశీల్ధార్

మెరక ముడిదాం: మండలానికి కొత్త ఎంపిడిఒగా ఎం. పావని, తహశీల్ధార్‌గా వైవి పద్మావతి శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. వీరు శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీ పై వచ్చారు. ఇది వరకు ఇక్కడ పని చేసిన ఎంపిడిఒ రత్నం శ్రీకాకుళం, తహశీల్ధార్ విజయ భాస్కర్ విశాఖపట్నం బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే.

తహశీల్ధార్‌గా త్రినాధనాయుడు

మెంటాడ: మండల తహశీల్దార్‌గా వి. త్రినాధనాయుడు శనివారం బాధ్యతలను స్వీకరించారు. పాడేరు నుంచి ఇక్కడకు బదిలీ పై వచ్చిన ఆయనకు సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలు తనకు పూర్తిస్థాయిలో సహారించాలని ఆయన కోరారు.

ఎల్ కోట తహసిల్దార్‌గా ప్రసాదరావు

లక్కవరపుకోట: లక్కవరపుకోట తహశీల్దార్‌గా డిఎంజిఎస్ ప్రసాదరావు నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికి వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో బొండపల్లి తహశీల్దార్ ప్రసాదరావును ఇక్కడ నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ప్రసాదరావు బాధ్యతలు చేపట్టారు.

తహశీల్దార్‌ను కలిసిన డీలర్లు

మెరకముడిదాం: మండలానికి నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పద్మావతిని శనివారం మండల రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్ధార్ రేషన్ డీలర్ల స్థితి గతులను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిటి గిరిధర్ పాల్గొన్నారు.

మరోసారి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అభివృద్దే ద్యేయంగా పనిచేస్తున్న ఈ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమా లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపలను చేశారు. రెల్లివలసలో రూ. 45 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం సుమారు రూ.30 లక్షలు అంచనాతో నిర్మించబోయే శ్మశాన వాటికతో పాటు ఎస్‌సి కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించబోయే కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. చల్లవానితోట, కుమిలి గ్రామాల్లో నిర్మించిన వెల్నెస్ సెంటర్లను ప్రారంభించారు. సిహెచ్‌అగ్రహారంలో శ్మశాన వాటికకు సుమారు రూ.22లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో సారి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ ప్రభుత్వం వస్తే మన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రారంభోత్స వాల్లో ఆయనతోపాటు ఎంపిపి మహంతి కళ్యాణి, వైస్ ఎంపిపిలు చంటిరాజు, అల్లాడ రమేష్, వైసిపి మండల అద్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, మహంతి జనార్ధనరావు, రామతీర్థ బోర్డు సభ్యులు డి. త్రినాదరావు, ఎఎంసి ఛైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, సర్పంచులు ఇజ్జురోతు అప్పలరాజు, మామిడి అప్పయ్యమ్మ, కొత్తకోట శ్రీరాములు, టొంపల సీతారాం, దేశెట్టి గణేష్, నాయకులు తాడిశెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


ప్రజాశక్తి- మెంటాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశం ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన సాదాసీదాగా సాగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల పురోగతిని వివరించారు. అందులో భాగంగానే ఐసిడిఎస్ సరుకుల సరఫరా విషయంలో గ్రామాలలో పలు అవకతవకలపై మీసాలపేట సర్పంచ్ మహాంతి రామునాయుడు నిలదీశారు. దీంతో రేషన్ డీలర్లు సరుకులు సక్రమంగా అందించడం లేదని ఐసిడిఎస్ అధికారులు స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ వెంకటరావు సత్వరమే దీనిపై చర్యలు చేపడతామని చెప్పారు. విద్యుత్ శాఖ ఎఇ పనితీరు రాజకీయ నాయకులు మధ్య వైషమ్యాలకు అద్యం పోసేలా వుందని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ లక్ష్మీబాయి, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, ఎంపిటిసిలు పతివాడ కుమారి, రెడ్డి ఎర్రన్నాయుడు, సర్పంచులు కాపారపు పైడిపునాయుడు, మహాంతి రామునాయుడు, వ్యవసాయ శాఖ మండల సలహాకమిటీ అధ్యక్షుడు లచ్చిరెడ్డి అప్పలనాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలపై స్థానిక రెండో ఎంఇఒ జి శ్రీనివాసరావుకు శనివారం సిఐటియు నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మాట్లాడుతూ గడిచిన 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉన్నప్పటికీ ఆ పథకాన్ని నడుపుతున్న కార్మికులకు ప్రభుత్వం మొండిచేయి చూపుతుందని మండి పడ్డారు. చాలీచాలని వేతనాలతో వారితో వెట్టి చాకిరి చేపిస్తుం దని దుయ్యబట్టారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20 పెంచాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి వంట వండే సమయంలో అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు బి సుధారాణి, జే కాసులమ్మ, కే సత్యవతి, బి నాగలక్ష్మి, జె రమణమ్మ, కే అచ్చియమ్మ, ఎం పైడితల్లి, పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతి పత్రాన్నిస్తున్న అప్పారావు, కార్మికులు

నేరాలు ఘోరాలు

సూర్య రెసిడెన్సీలో ఒడిశా వాసి మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రైల్వే జంక్షన్‌లో ఉన్న సూర్య రెసిడెన్సీలో ఒడిశా వాసి మృతి చెందారు. ఒడిషా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన ఇందు భూషణ్ గ్రోత్ సెంటర్ కంపెనీకి కన్సల్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈనెల ఒకటిన సూర్య రెసిడెన్సీలో రూమ్ తీసుకుని ఉదయం 4.30గంటలకు రూమ్‌లోకి వెళ్ళాడు. దుర్వాసన రావడంతో లాడ్జి సిబ్బంది తలుపులు పగలగొట్టి చూడగా భూషణ్ మృతి చెంది మంచంపై బోర్లాపడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి మృతుని ఫోన్‌తో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మండలంలోని రేగ గ్రామ పంచాయతీ శివారులో నివాసం ఉంటున్న కొచ్చర్ల మోహనసాయి (20) మామిడి చెట్టు కొమ్మకు చీరతో ఉరేసుకుని మృతి చెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రేగలో నివాసముంటున్న మోహనసాయి ఆయన భార్య పద్మల మధ్య గత రెండు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన మోహనసాయి పినతల్లి (పిన్ని) లక్ష్మి చీర పట్టుకుని ఆయన సొంత మామిడి తోటలో శుక్రవారం మధ్యాహ్నం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కంటపడడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతిని తండ్రి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ ఆర్ గోపాలరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి శవపంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్‌కోట సిహెచ్‌సికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాలరావు వెల్లడించారు.